నిరుపయోగంగా విత్తన ఏటీఎంలు

- ఆర్‌ఎస్‌కేల్లో మూలనపడిన కియోస్క్ యంత్రాలు
- ఎరువులు, పురుగు మందులు అందక రైతుల అవస్థలు
- ప్రైవేట్ షాపుల్లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయలేక రైతులు తిప్పలు


ఉరవకొండలో మూతపడిన ఆర్‌ఎస్‌కే కేంద్రం


ఆర్‌ఎస్‌కేలో మూలనపడిన కియోస్క్ డిజిటల్ యంత్రం

ఉరవకొండ: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఊరూరా విత్తన ఏటీఎంలు నిరుపయోగంగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాల వస్తువులు, పశువుల దాణా, ఆక్వా ఫీడ్, మార్కెటింగ్ సేవలు అన్నీ పారదర్శకంగా రైతుల ఇంటి ముంగిటకే అందించేలా ప్రతి సచివాలయ పరిధిలోనూ ఆర్‌బీకేల్లో కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్) యంత్రాలు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినా..కియోస్క్ యంత్రాలను మాత్రం నిరుపయోగంగా ఉంచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేసిన కియోస్క్ యంత్రాలు మూలన పడేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలోని 225 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి ఆర్‌బీకే (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం)లోనూ ఒక్కొక్కటి చొప్పున కియోస్క్ యంత్రం ఏర్పాటు చేశారు. ఈకేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వాటిని కోనుగోలు చేసింది. ఈయంత్రాలతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసే టప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గర్లో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అవసరమైన అన్ని సేవలూ ఈడిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా పొందే అవకాశం ఉంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా అవగాహన కల్పించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించారు.

కూటమి ప్రభుత్వం 'కియోస్క్' సేవలపై నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను వినియోగించడం లేదు. కనీసం ఎరువులను బుక్ చేసుకునేందుకు కూడా వినియోగించుకోకపోవడంతో రూ.లక్షలు ప్రజాధనం వృథా అవుతోంది. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయి రబీ సీజన్ ప్రారంభమైనా వీటిని వినియోగించుకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది.

నియోజకవర్గం పేరు	రైతుసేవా కేంద్రాలు	కియోస్క్ యంత్రాలు
ఉరవకొండ	71	71
రాయదుర్గం	79	79
కళ్యాణదుర్గం	75	75
	225	225

డిజిటల్ విధానం అమలు చేయాలి



నాడు రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ సేవలు తెలియచేసేవారు. అప్పటిలాగే ఇప్పుడు డిజిటల్ సేవలు అందించాలి.

– తేజోనాథ్, ఆమిద్యాల గ్రామం, ఉరవకొండ మండలం

ఎరువులు అందించాలి



రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కోనుగోలు చేశాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరహాలోనే రైతులకు అవసరమైన ఎరువులు, అన్ని రకాల సేవలూ అందించాలి.

– కావలి వెంకటేష్, మల్లాపురం గ్రామం, విడపనకల్లు మండలం

కియోస్క్ యంత్రాలను వినియోగంలో తెస్తాం



రైతుసేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. డివిజన్ పరిధిలో కియోస్క్ యంత్రాలను వినియోగించేలా ఆదేశాలు ఇస్తాం.

– పద్మజ, ఏడీఏ, ఉరవకొండ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కొనకొండ్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం కొనకొండ్ల గ్రామంలో సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీకి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్త ఎక్కడబడితే అక్కడ పడేయటం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మెడికల్ కిట్లు, పారాసిటమోల్ మాత్రలు, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర, నాయకులు నారాయణ, గోవిందు, కోటిరెడ్డి, రామాంజనేయులు, భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొల్లాపురం 'పల్లెపండుగ'లో రచ్చరచ్చ

- ఇరువర్గీయుల మధ్య వాగ్వాదం
- సీనియర్ కార్యకర్తపై గొడవకు దిగిన మరో వర్గం

కణేకల్లు: మండలంలోని సొల్లాపురం గ్రామంలో అధికారులు శుక్రవారం నిర్వహించిన 'పల్లెపండుగ' రచ్చరచ్చయ్యింది. ముందుగా కార్యక్రమం ప్రారంభించే ముందు అధికారులు ఫొటో తీయిస్తుండగా, గొడవకు దారితీసింది. వివరాలు.. సొల్లాపురం గ్రామంలోని బీసీ కాలనీలో అధికారులు 'పల్లెపండుగ' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు పనికి భూమిపూజ చేస్తున్న క్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అధికారులు ఫొటో తీయిస్తుండగా ఇరువర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఎన్నికల సమయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న కొత్త నేతలు ఫొటో కోసం నిల్చొన్న టీడీపీ సీనియర్ కార్యకర్త దూదేకుల సత్తార్‌ను...' సత్తార్ కాస్తా పక్కకు తప్పుకో...మేం నిలబడతాం' అని చెప్పారు. స్థలం చాలా ఉంది.. నన్నే పక్కకు తప్పుకోమంటే ఎలా? అని సత్తార్ ఎదురుచెప్పడంతో ఒక్కసారిగా కోపోద్రిక్తులైన మరో వర్గం నాయకులు రెచ్చిపోయారు. ముందు నువ్వు ఇక్కడి నుంచి తప్పుకుంటావా? లేదా? అంటూ మండిపడ్డారు. నేను ఇక్కడ నుంచి తప్పుకునే ప్రసక్తేలేదని సత్తార్ చెప్పడంతో అతన్ని కులంపేరుతూ దూషిస్తూ... నువ్వెంతరా .. మమ్మల్నే ఎదురిస్తావా? అంటూ అతనిపై ఒక్కసారిగా గొడకు దిగారు. ఇరువర్గీయుల మధ్య వాగ్వాదం ముదిరి ఒకరిపై ఒకరు చేయిచేసుకునే దాకా వచ్చింది. 'పల్లెపండుగ'లో ఘర్షణ జరగడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఎవరికీ సర్దిచెప్పలేక అధికారులు మిన్నకుండిపోయారు. చివరికి సీనియర్ టీడీపీ నాయకులు జోక్యం చేసుకొని ఇరువురికీ సర్దిచెప్పారు.

కూడేరు: ఇప్పేరు, కలగళ్ల పంచాయతీల్లో అధికారులు పల్లె పండుగ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రూ.33 లక్షల ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్లు, నిర్మాణపు పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఓబులేసు, సువర్ణమ్మ, ,ఈఓఆర్డీ రాధాకృష్ణ, పీఆర్ ఏఈ రమణయ్య,ఏపీఓ తులసీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని నక్కలపల్లి, శ్రీరంగాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. శ్రీరంగాపురంలో రూ.11.50 లక్షలతో సీసీ రోడ్లు, నక్కలపల్లి గ్రామంలో రూ.9.50 లక్షలతో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఏపీఓ సూర్యప్రకాశ్, పీఆర్ ఇంజనీర్ పరుశురాం, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మునగలో పోషక విలువలు


కలుగోడులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి


అడవిగొల్లపల్లిలో మునగ మొక్కలు నాటుతున్న సీడీపీఓ వనజఅక్కమ్మ

శెట్టూరు: ఆరోగ్యానికి పోషక విలువలున్న గని వంటిది మునగ చెట్టు అని ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అడవిగొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ గర్భిణులు, బాలింతలకు మునగ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మునగ ఆకు, మునగ కాయలతో అనేక పోషకాలు లభిస్తాయన్నారు. మునగను ఎలా వండుకోవాలి, ఎలా తీసుకుంటే పోషకాలు అందుతాయనే విషయాలను తెలియజెప్పారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రతి ఇంటి వద్ద మునగ మొక్క ఉండాలని సీడీపీఓ తెలియజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మునగ మొక్కను నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త జానకి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మునగాకులో అధిక పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. మండలంలోని కలుగోడులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ' మునగ.. ఆరోగ్య పోషకాల గని – ఆరోగ్య ప్రదాయిని' అంశంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగాకు వినియోగించడంతో రోగనిరోధకశక్తి పెరిగి, మెరుగైన జీర్ణక్రియను అందిస్తుందన్నారు. విటమిన్ ఏ, సీతో పాటు కాల్షియం, ఐరన్, పోటాషియం పుష్కలంగా ఉంటుందన్నారు. కొవ్వును తగ్గిస్తూ, చక్కెర వ్యాధిని నియంత్రిస్తుందన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం, డి.హిరేహాళ్ మండలాల సూపర్‌వైజర్లు అంజినమ్మ, నాగరత్న, ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయ, శాంతికుమారి, కుళ్లాయమ్మ, గీత, ఏఎన్‌ఎం రాజమ్మ పాల్గొన్నారు.

యువత పాత్ర కీలకం

బొమ్మనహాళ్: ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకమని తహసీల్దార్ మునివేలు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. మెరుగైన పాలనకు బాటలు వేస్తూ పౌరుల బంగారు భవితను ఓటు నిర్దేశిస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, అధ్యాపకులు సుబ్బరాయుడు, శంకర్ లింగ, హనుమంత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, ఉంతకల్లు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ గతంలో జరిగిన భూముల రీసర్వేలో తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. భూవిస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, ఎల్‌పీ నంబర్లపై, ఒకే సర్వే నంబర్‌లో అన్నదమ్ముల భాగాలను వేరు చేసుకోవడం, ఒకరి పేరిట ఉన్న భూమి మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో చూపించడం తదితర సమస్యలు ఉన్నట్లు తెలిసిందన్నారు. సర్వేయర్ రవితేజ, వీఆర్వోలు పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలో శనివారం నుంచి ఈనెల 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం గ్రామసభల వివరాలను తెలియజేశారు. 19న గూళ్యం, 21న రాళ్లపల్లి, 23న రాంపురం, 24న చెన్నంపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాలికలు ఉన్నతంగా చదువుకోవాలి


మాట్లాడుతున్న ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి

గుమ్మఘట్ట: బాలికలు ఉన్నతంగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి , ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళీ తెలిపారు. శుక్రవారం మండలంలోని భూపసముద్రం ప్రభుత్వ పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎలా ఎదుర్కొవాలి? విద్య ప్రాధాన్యత, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై విద్యార్థినులకు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, ఎస్‌ఐ ఈశ్వరయ్య, ఏటీఎల్ పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు, ఆర్డీటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


చాబాలలో పల్లె పండుగలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచు మల్లెల జగదీష్

వజ్రకరూరు: పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచు మల్లెల జగదీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని చాబాల గ్రామంలో పల్లె పండుగ –పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో రూ.18 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిర్మాణ పనులకు సర్పంచు మల్లెల జగదీష్ భూమి పూజ చేశారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాలు కావాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎర్రిస్వామి, పీఆర్ఏఈ మణి భూషణ్, ఏపీఓ లక్ష్మికాంత, గ్రామ కార్యదర్శి నాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'మద్యం షాపుల నిర్వహణను అడ్డుకోవడం సరికాదు'

కళ్యాణదుర్గం: ప్రభుత్వం టెండర్ల ద్వారా కేటాయించిన మద్యం షాపుల నిర్వహణను ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అడ్డగించడం సరైనది కాదని బీజేపీ నేత విశ్వనాథ్ రెడ్డి అన్నారు. కళ్యాణదుర్గం చరిత్రలో కిడ్నాప్‌లు, బెదిరింపులు, ఒకడు బతుకుతుంటే అడ్డుపడే సంస్కృతి లేదని తన ఆవేదనను వీడియో రూపంలో సోషల్ మీడియాలో పెట్టాడు. ఇది శుక్రవారం వైరల్ అయ్యింది. రూ.వేల కోట్లకు అధిపతి అయిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే.. చిరు వ్యాపారమైన మద్యం షాపులను లాక్కోవాలన్న ఆలోచన ఎందుకు అని ప్రశ్నించాడు. నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, కంబదూరు, శెట్టూరు, కుందుర్పి మద్యం షాపులను దక్కిచుకున్న యజమానులను బెదిరించడం సరికాదన్నారు. తన 47 ఏళ్ల జీవితంలో ఇలాంటి ఘటనలు కళ్యాణదుర్గంలో చూడలేదని వీడియోలో అసహనం వ్యక్తం చేశాడు.

శెట్టూరులో తెరచుకోని మద్యం దుకాణం


శెట్టూరులో తెరచుకోని మద్యం షాపు

శెట్టూరు: మండల కేంద్రంలో మద్యం దుకాణం తెరచుకోలేదు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మందుబాబుల ఆశలకు టీడీపీ నాయకులు నిరాశ మిగిల్చారు. కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచి, నాలుగు రోజుల క్రితం లాటరీల ద్వారా మద్యం షాపులను కేటాయించారు. అయితే గురువారం దుకాణం తెరవాల్సి ఉండగా, స్థానిక ప్రజాప్రతినిధి అనుమతి లేనిదే తెరవొద్దని దుకాణదారుడిని టీడీపీ నాయకులు అడ్డగించినట్లు తెలిసింది. దీంతో చేసేదిలేక దుకాణదారుడు గుజ్జల నగేష్ ..మద్యం సీసాలన్నీ దించినా షాపు తెరవలేకపోయాడు.

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత


గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి లక్ష్మీనారాయణ

కూడేరు: గర్భిణులు రక్తహీనతకు గురైతే ప్రసవం కష్టతరంగా మారి ఇబ్బంది పడాల్సి వస్తుందని వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి గర్భిణులు వచ్చారు. వారికి హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వైద్యాధికారి గర్భిణులను పరీక్షించి, మందులిచ్చారు. పౌష్టికాహార లోపంతో రక్తహీనత ఏర్పడుతుందని, తప్పక పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు జయ, మాధవి, చంద్రకళ, రేష్మ, ఏఎన్‌ఎంలు మాధవి, త్రివేణి, రాధిక, సుజాత, భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అధ్వాన పాలన, అధికారుల నిర్లక్ష్యంపై నిలదీత


టీడీపీ సర్పంచ్‌ను నిలదీస్తున్న టీడీపీ కార్యకర్త

శెట్టూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అధ్వాన పాలన, అధికారుల నిర్లక్ష్యంపై అడుగడుగునా అధికార పార్టీ కార్యకర్తలే నిలదీస్తున్నారు. శెట్టూరు మండల కేంద్రంలో టీడీపీ సర్పంచును అదే పార్టీకి చెందిన కార్యకర్త వీధుల్లో అధ్వానంగా ఉండడంతో నిలదీయడమే ఇందుకు నిదర్శనం. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ జరిగింది. గ్రామ సభ వద్దకు వచ్చిన సర్పంచు, నాయకులను ఎస్సీ కాలనీలో ఉన్న టీడీపీ కార్యకర్త వీధుల్లో అధ్వానంగా ఉండడంపై నిలదీశాడు. దీనికి ఆయన 'నేనేం చేయాలి.. మా ఇంటి వద్ద వీధిలోనూ ఇలా ఉంది' అని బదులిచ్చాడు. దీనికి ఆయన ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఎలాగైనా ఉంచుకోండి.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరాడు.

భూమి మాయం చేశారని వినతి..

మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఇటీవల జరిగిన రీ సర్వేలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో తన భూమి రికార్డులో లేకుండా మాయం చేశారని బసంపల్లి గ్రామానికి చెందిన రైతు మల్లేషప్ప తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టితో వాపోయాడు. తన పూర్వీకుల నుంచి సర్వే నంబర్ 376లో 4.28 ఎకరాల భూమి రికార్డుల్లో కనిపించకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. శెట్టూరు, కమతనహళ్లిలోనూ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

చిరుత సంచరిస్తోందని బెంబేలు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి, గంగవరం గ్రామాల మధ్య ఉన్న అరటితోటల్లో చిరుత సంచరిస్తోందని గ్రామస్తులు, రైతులు హడలిపోతున్నారు. శుక్రవారం పొలం పనులకు వెళ్లిన కూలీలకు అరటి తోటలో చిరుత కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. రెండు రోజులుగా చిరుత ఇక్కడ పరిసర ప్రాంతాల్లో తిరుగుతోందని స్థానిక రైతులు తెలిపారు.

నేడు నట్టల నివారణ మందు పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగేదొడ్డి ,75 వీరాపురం గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ఈనెల 19న నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యులు నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, పశువుల పెంపకందారులు, రైతులు నట్టల నివారణ మందు తప్పక వేయించాలని కోరారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

బ్రహ్మసముద్రం : గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయనున్నట్లు పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మండలంలోని వేపులపర్తి, పాలవెంకటాపురం గ్రామాల్లో నట్టల నివారణ మందు ఇవ్వనున్నట్లు తెలిపారు.

అవ్వ ఒడికి బాలుడిని చేర్చిన పోలీసులు


నాయనమ్మకు బాలుడిని అప్పగిస్తున్న ఏఎస్‌ఐ ఈశ్వరయ్య

కణేకల్లు: తప్పిపోయిన ఓ బాలుడి ఆచూకీని పోలీసులు గంట వ్యవధిలోనే పసిగట్టి సురక్షితంగా అవ్వ ఒడికి చేర్చారు. వివరాలు.. కణేకల్లులోని దిగువగేరిలో నివాసం ఉంటున్న కావలి శాంతమ్మ సంరక్షణలో ఉన్న మనవడు కావలి జైదీప్ శుక్రవారం ఉదయం 9 గంటలకు అంగన్‌వాడీ కేంద్రానికెళ్లాడు. అదే సమయంలో అంగన్‌వాడీ సెంటర్ సహాయకురాలు ఇతర పిల్లలను పిలుచుకొచ్చేందుకు బయటికెళ్లింది. దీంతో జైదీప్ సెంటర్ నుంచి బయటికొచ్చి బస్టాండ్‌కు చేరుకున్నాడు. అయితే తిరిగి సెంటర్ వద్దకు ఎలా వెళ్లాలో తెలియక ఏడుస్తూ ఉండిపోయాడు. స్థానికులు గమనించి ఆరా తీయబోతే సరైన సమాధానం చెప్పలేక పోయాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, కానిస్టేబుల్ సూర్యనారాయణ బాలుడి ఫొటో తీసి వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు. అనంతరం వీధులన్నీ కలియ తిరిగి ఆరా తీశారు. చివరికి వాట్సాప్ గ్రూప్‌ల్లో ఫొటో చూసిన ఓ వ్యక్తి ఆ అబ్బాయి నాయనమ్మ అడ్రస్ తెలపడంతో ఆమెకు అప్పగించారు. అప్పటి వరకూ గుక్కపట్టి ఏడుస్తున్న జైదీప్ అవ్వను చూడగానే మురిసిపోయాడు. తప్పిపోయిన మనవణ్ణి అప్పగించిన పోలీసులకు శాంతమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

క్లుప్తంగా

22న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటరమణ

బొమ్మనహాళ్: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నబీరసూల్‌తో కలిసి రౌడీ షీటర్లు, అక్రమ మద్యం, మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తప్పవన్నారు.

అరవకూరు చెరువులోకి కృష్ణా జలాలు


కూడేరు: కృష్ణా జలాలతో అరవకూరు చెరువు

కూడేరు: మండలంలోని అరవకూరు చెరవులోకి కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ద్వారా ఆత్మకూరు మండలం సింగపల్లి చెరువుకు నీరు సరఫరా చేస్తున్నారు. చెరువు మరువ పారి వంక ద్వారా దిగువన ఉన్న అరవకూరు చెరువులోకి నీరు చేరుతోంది. చెరువు పూర్తిగా నిండితే ఆయకట్టులో పంటలు సాగు చేసుకుంటామని రైతులు చెప్పున్నారు.


విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లి, మైలాపురం శివారులో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి పడ్డాయి. దీంతో గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురిశాయి. దీంతో శుక్రవారం ఐదు విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు విగిరిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూలేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారిగా ఆంజనేయులు

రాయదుర్గం: ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారిగా వాల్మీకి ఆంజనేయులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా కమిటీ తనపై ఉంచిన నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానన్నారు. విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, మధ్యాహ్న భోజనం అమలు తీరు సక్రమంగా లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకే బస్సుయాత్ర


కూడేరు: బస్సు యాత్ర కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

కూడేరు: సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకే సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. శనివారం కమ్మూరు, అరవకూరు మీదుగా కూడేరుకు బస్సు యాత్ర చేరుకోనుంది. దీంతో శుక్రవారం సీపీఎం నాయకులు బస్సుయాత్రకు తరలిరావాలని మండలంలో కరపత్రాలు పంపిణీ చేశారు. మండల నాయకులు కరీం, మల్లికార్జున , సీఐటీయూ హమాలీ యూనియన్ నేతలు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

గుండె పోటుతో పాస్టర్ మృతి


పాస్టర్ ప్రభాకర్ (ఫైల్)

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన పాస్టర్ ప్రభాకర్ (62) గుండెపోటుతో మృతి చెందాడు. కంబదూరుకు చెందిన ప్రభాకర్ రాళ్ల అనంతపురం గ్రామంలోని చర్చిలో పాస్టర్‌గా పని చేసేవారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రార్థన కూడికలో పాల్గొన్నారు. సాయంత్రం ఉన్నఫలంగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాస్టర్ మృతి పట్ల పలువురు పాస్టర్లు సంతాపం తెలియజేశారు.